
ప్రజాశక్తి
సోమవారం 21 అక్టోబర్ 2024
5
పార్వతీపురం మన్యం



మే 18 నుంచి శ్యామలాంబ పండగ

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సాలూరు శ్యామలాంబ అమ్మవారి పండగ మే 18,19,20 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆదివారం అమ్మవారి ఆలయంలో జరిగిన సమావేశంలో శ్యామాలంబ అమ్మవారి గ్రామ దేవత పండుగ తేదీలను ప్రకటించారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమశాఖా మంత్రి సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్ మాట్లాడుతూ వచ్చే ఏడాది మే 18న ఉయ్యాల కంబాల, మే 19న తోలెళ్లు, మే20న ప్రధాన పండగ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవ కమిటీ చైర్మన్‌గా అక్కేన అప్పారావును నియమించారు. సమావేశంలో ఆలయ ఇఒ రమేష్, యువరాజు, సాలూరు పుర ప్రముఖులు పాల్గొన్నారు.

బడిదేవరకొండపై గ్రానైట్ తవ్వకాలకు ఇచ్చిన

అనుమతులు రద్దు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని బడిదేవర కొండపై ప్రభుత్వం ఇచ్చిన అక్రమ గ్రానైట్ లీజు లైసెన్స్ రద్దు చేయాలని, ఈ విషయమై ఐక్య పోరాటం చేపట్టాలని రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు ఏకగ్రీవంగా తీర్మానం చేసి ఆమోదించాయి. బడిదేవరకొండపై ఎంఎస్ పి గ్రానైట్ లీజు లైసెన్స్ అక్రమం, చట్టవిరుద్ధం, పర్యావరణ వ్యతిరేకం. రాష్ట్ర ప్రభుత్వం లీజు లైసెన్స్ రద్దు చేయాలని కోరుతూ ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. ముందుగా ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి ప్రవేశపెట్టే తీర్మానాన్ని నాయకులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు, ఉమ్మడి కార్యాచరణ పోరాటం చేపట్టాలని నిర్ణయించారు. సమావేశంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2016లో ఎంఎస్‌పి గ్రానైట్స్ కంపెనీకి బడిదేవరకొండపై గ్రానైట్ చేసుకొనేందుకు లీజు లైసెన్స్ ఇచ్చిందని, ప్రజాభిప్రాయ సేకరణ సభలో ప్రజలంతా వ్యతిరేకించినా గ్రానైట్ లైసెన్స్ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ఇది ముమ్మాటికీ పర్యావరణ పరిరక్షణకు విరుద్ధమైన చర్యగా పేర్కొన్నారు. అప్పట్లో ప్రభుత్వం లీజు లైసెన్స్ ఇవ్వడానికి వ్యతిరేకంగా గతంలో ప్రజాసంఘాలు, రాజకీయపార్టీలు ఉద్యమించగా, అటవీ శాఖ రిజర్వ్ ఫారెస్ట్‌కు చెందిన కొండపై లైసెన్స్ ఎలా ఇచ్చారని అభ్యంతరం చెప్పిందని గుర్తు చేశారు. దీని ఫలితంగా ఫారెస్ట్, రెవెన్యూ ఉమ్మడి సర్వేలో బడిదేవరకొండ రిజర్వ్ ఫారెస్ట్ డిపార్ట్మెంట్ దేనని తేలిందన్నారు. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఎంఎస్‌పి గ్రానైట్ కంపెనీకి ఇచ్చిన లీజు లైసెన్స్ 2017లో రద్దు చేసిందన్నారు. మళ్లీ ఇపుడు అది రెవెన్యూ కొండగా ఎలా మారింది? డబ్బుంటే దానికి అధికారం తోడైతే ఏదైనా సాధ్యమేనని ఈ లైసెన్స్ వ్యవహారం రుజువు చేసినట్టుందని విమర్శించారు. ఏ బడిదేవర కొండపై లీజు లైసెన్స్ ఇచ్చారో అదే కొండపై ఎన్నో ఏళ్ల నుంచి పోడు వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనులకు అటవీ హక్కు చట్టం ప్రకారం పోడు పట్టాలు ప్రభుత్వం ఇచ్చిందని, గిరిజలకు పట్టాలు ఇచ్చిన దానిపైనే గ్రానైట్ లీజు లైసెన్స్ ఇవ్వడం చట్ట విరుద్ధమేనని అన్నారు. దీనివల్ల గిరిజనుల జీవనోపాధిని తీవ్రంగా దెబ్బతీస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మైనింగ్, జియాలజీ మేనేజింగ్ డైరెక్టర్ వెంకటరెడ్డి అవినీతికి పాల్పడి అక్రమ లైసెన్సులు ఇచ్చారని నేడు ప్రభుత్వం అతన్ని అరెస్టు చేసి సిబిఐతో విచారణ జరుపుతున్నదని, అదే వెంకటరెడ్డి బడిదేవరకొండ గ్రానైట్ లీజు లైసెన్స్ పునరుద్ధరించారని అన్నారు. కావున ప్రభుత్వం తక్షణమే బడిదేవరపై ఇచ్చిన గ్రానైట్ లైసెన్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు తీర్మానం



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కృష్ణమూర్తి

పార్వతీపురం మండలం ప్రజలంతా బడిదేవరకొండను దేవతగా విశ్వసించి పూజలు చేస్తారని, అందువల్లే వర్షాలు కురిసి పంటలు పండుతున్నాయని ప్రజల నమ్మకమని అన్నారు. ప్రజల నమ్మకాన్ని గుడ్డి విశ్వాసం అనుకోవచ్చు కానీ బడిదేవరకొండకు మేఘం దిగితే వర్షం కురిసి తీరుతుందన్నారు. కావున మండలానికి సాగునీటి ప్రాజెక్టులు లేకపోయినా పంటలు పండడం మాత్రం ఖామన్నారు. బడిదేవర కొండ గ్రానైట్ తవ్వకాల వల్ల పార్వతీపురం ప్రాంతం పర్యావరణ దెబ్బతీయడమే కాకుండా ఈ ప్రాంత రైతులు, గిరిజనులు, ప్రజల జీవితాలను నాశనం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కావున ప్రభుత్వం తక్షణమే గ్రానైట్ లీజు లైసెన్స్ రద్దు చేయాలని రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. సమావేశంలో పి శ్రీను నాయుడు (ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం), బి.నరసింగరావు (సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ), ఈశ్వరరావు (సిపిఎంఎల్ లిబరేషన్), పి సంగం, ఆర్‌విఎస్ కుమార్ (సిపిఐ), పి.రంజిత్‌కుమార్ (గిరిజన సంక్షేమ సంఘం) నాయకులు పి.రంజిత్ కుమార్, పి.జయకృష్ణ, అన్నా బత్తుల దుర్గాప్రసాద్ (జనసేన), వి.దాలినాయుడు (సామాజిక కార్యకర్త), రెడ్డి వేణు (సిపిఎం జిల్లా కార్యదర్శి), పి సన్యాసిరావు (పట్టణ పౌర సంక్షేమ సంఘం), గిరిజన నాయకులు పి.రాము ముత్యాలు, లక్ష్మణరావు శంకర్రావు, రావికోన సర్పంచ్ కె రామస్వామి, పాల్గొన్నారు.

బడిదేవరకొండపై తవ్వకాలకు అనుమతులు లేవు

జిల్లా గనులు, భూగర్భ శాస్త్ర అధికారి జి.జయప్రసాద్

ప్రజాశక్తి - పార్వతీపురం

బడిదేవర కొండపై తవ్వకాలకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయలేదని జిల్లా గనులు, భూగర్భశాస్త్ర అధికారి జి.జయప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బడిదేవరకొండపై వచ్చిన వార్తపై ఆయనపై విధంగా స్పందించారు. మండలంలోని కోరి గ్రామం సర్వే నెంబరు1లో 28హెక్టార్ల విస్తీర్ణంలో కలర్ గ్రానైట్ ఖనిజం కోసం ఎంఎస్‌పి కంపెనీ 20 ఏళ్ల క్రితం అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ మైన్స్, జియాలజీ, విజయనగరం వారికి దరఖాస్తు చేసుకుందన్నారు. క్వారీ లీజు ప్రాంతాన్ని విజయనగరం డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్, డైరెక్టర్ ఆఫ్ మైన్స్, జియాలజీ, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ సర్వే %డ% ల్యాండ్ రికార్డ్స్ సంయుక్త పరిశీలన చేసి నివేదిక సమర్పించాలని అప్పటి పార్వతీపురం సబ్ కలెక్టర్ ఆదేశించారని పేర్కొన్నారు. దరఖాస్తు చేసిన భూమి రాతి భూమి అని, రెవెన్యూ శాఖకు, అటవీ శాఖకు మధ్యలో ఉందన్నారు. ఏ సాగుకూ పనికి రాదని, గయాలుగా వర్గీకరించబడిన కొండ పోరంబోకు కొండని వివరించారు. మైనింగ్ భూమి సరిహద్దులో రైల్వే ట్రాక్‌లు, రహదారి వంతెనలు ఏవీలేవని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న భూమికి సమీపంలో నీటిపారుదల వనరులు, గ్రామ సరిహద్దుకు దూరంగా ఉందని చెప్పారు. అందు వలన క్వారీ లీజుకు అభ్యంతరం లేదని జిల్లా స్థాయి స్క్రీనింగ్ కమిటీలోని సభ్యులు తమ నివేదికలను సబ్ కలెక్టర్ కు అందించారని అన్నారు. నివేదికలు ఆధారంగా అప్పటి విజయనగరం కలెక్టర్ ఎంఎస్‌పి కంపెనీకి అనుకూలంగా నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ జారీ చేశారని చెప్పారు. 20ఏళ్ల నాటి ఈ కార్యాలయ రికార్డులను పరిశీలించగా 2014న విశాఖపట్నంలోని జోనల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ మైన్స్, జియాలజీ ద్వారా హైదరాబాద్‌లోని గనులు, భూగర్భశాస్త్ర డైరెక్టర్‌కు గ్రాంట్ ప్రతిపాదనలను సమర్పించిందన్నారు. అందువల్ల సర్వే తనిఖీ పూర్తయిన తర్వాత, ఈ కార్యాలయం, లీజులను విజయనగరం జిల్లా పార్వతీపురం మండలం కోరి గ్రామం సర్వే నెం.1లో 16.560 హెక్టార్ల విస్తీర్ణంలో కలర్ గ్రానైట్ కోసం క్వారీ లీజును ఇరవై సంవత్సరాల కాలానికి (16.8.2016 – 15.08.2036) మం జూరు చేసిందన్నారు. పర్యావరణ, కాలుష్య నియం త్రణ మండలి అనుమతులు కూడా ఉన్నట్లు చెప్పారు. రికార్డుల ప్రకారం లీజు మంజూరు చేయ బడిన ప్రాంతం షెడ్యూల్ చేయని ప్రాంతమని, సమీపంలో విగ్రహాలు లేవని, ఇది సబ్ ప్లాన్ ఏరియా కింద వస్తుంది తప్ప బడిదేవర కొండలో లీజులు మంజూరు చేయలేదని ఆ ప్రకటనలో వివరించారు.

నేడు పోలీస్ అమరుల సంస్మరణ దినోత్సవం

పార్వతీపురం రూరల్: పోలీస్ అమరుల సంస్మరణ దినోత్సవ సందర్భంగా సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో, అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ ఉదయం 8 గంటలకు స్మృతి పరేడ్ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మాధవరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున జిల్లా పౌరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన ప్రకటనలో కోరారు.



మంత్రి సంధ్యారాణికి బొకె అందజేసి కృతజ్ఞతలు తెలుపుతున్న ట్రాక్టర్ల యజమానులు

సామాన్యులకు అండగా ప్రభుత్వం : మంత్రి

ప్రజాశక్తి - సాలూరురూరల్

రాష్ట్ర ప్రభుత్వం ఎల్లవేళలా సామాన్య ప్రజానీకానికి అండగా ఉంటుందని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. ఆదివారం తన క్యాంప్ కార్యాలయంలో సాలూరు ట్రాక్టర్ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సామాన్య ప్రజలకు అన్ని విధాలా, అన్ని వేళలా తోడుగా ఉంటూ వారి జీవన ప్రమాణాలు పెరిగేలా పనిచేస్తుందని తెలిపారు. ముఖ్యంగా సాలూరు పరిసరప్రాంతాల్లో ట్రాక్టర్ల ద్వారా యువత అధిక ఉపాధి పొందుతున్నారని, అటువంటి యజమానులు నష్టపోకుండా దగ్గరలో ఉన్న వాగులు, నదులు వద్ద స్థానిక అవసరాలకు సరిపడా ఇసుకను తీసుకొనే అవకాశం ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. ఉచిత ఇసుకను అధికార, ప్రతిపక్షం అన్న తేడా లేకుండా ఎవరైనా ఎంత కావాలంటే అంత తీసుకోవచ్చునని తెలిపారు.

ఉచిత ఇసుక పాలసీపై సిఎంకు ట్రాక్టర్ల యజమానులు కృతజ్ఞతలు

గత వైసిపి పాలనలో ఇసుక అధికరేట్లు ఉండడం వల్ల నిర్మాణ రంగం పూర్తిగా దెబ్బతిని లక్షల్లో నష్టపోయామని, చాలామంది వరకు ట్రాక్టర్ వాయిదాలు చెల్లించక పోయామని, దీంతో చాలామంది రోజువారీ కూలీలుగా మారిపోయారని తెలిపారు. కుటుంబంతో సహా రోడ్డున పడ్డామన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం తీసుకురావడం వల్ల తమలో కొత్త ఆశలు చిగురించాయని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణికి పుష్పగుచ్ఛం అందించి ట్రాక్టర్ యజమానులు వారి ఆనందాన్ని మంత్రితో పంచుకున్నారు. కార్యక్రమంలో ట్రాక్టర్ యజమానులు గులిపిల్లి నారాయణరావు, నల్లి సత్యనారాయణ, కొర్రాయి శ్రీను, చలుమూరి సంతోష్, శ్రీను, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సిఎంగా ఫ్లైట్‌లో ప్రయాణించలేదు

సచివాలయంలో దందాలు చేయలేదు

ప్రజల మధ్యనే తిరిగాను : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

డిప్యూటీ సిఎం హోదాలో తానెప్పుడూ విమానాల్లో తిరిగి ప్రజాధనం వృధా చేయలేదని మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. శనివారం టిడిపి నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో మంత్రి సంధ్యారాణి చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా, డిప్యూటీ సిఎంగా తాను సచివాలయంలో తిష్ట వేసి లావాదేవీలు నడపలేదన్నారు. నియోజకవర్గంలోని 80వేల ఇళ్లకు వెళ్ళి సమస్యలు అడిగి తెలుసుకున్నానని చెప్పారు. ఒకవేళ మంత్రివర్గ సమావేశాలకు వెళ్లాల్సి వస్తే రైలులోనే ప్రయాణించానని, ఏనాడూ విమానంలో ప్రయాణించలేదన్నారు. ఎన్నికల ముందు నియోజకవర్గ ప్రజలకు ముఖ్యంగా గిరిజనులకు ఇచ్చిన హామీల గురించి గిరిజన సంఘాలు ప్రశ్నిస్తున్నాయని, చేతనైతే వాటికి సమాధానాలు చెప్పాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు ప్రత్యేక డిఎస్సీ నిర్వహిస్తామని హామీ ఇచ్చారని, జీవో 3ను పునరుద్ధరించకుండా అది సాధ్యం కాదని చెప్పారు. దీనిపై గిరిజనులకు జవాబు చెప్పాలని కోరారు. సాలూరు మండలం జగ్గుదొరవలసలో నిర్వహించిన నిరాహారదీక్ష శిబిరాన్ని సందర్శించిన సమయంలో షెడ్యూల్ లేని గిరిజన గ్రామాలను టిడిపి అధికారంలోకి వస్తే చేరుస్తామని ఇచ్చిన హామీ గురించి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ శాఖ డిడి రుక్మాంగద కృష్ణను ఎలాంటి కారణం లేకుండా సరెండర్ చేయడం సరికాదని గిరిజన సంఘాలు విమర్శించాయని, దీనికి తాను మద్దతు తెలిపానని చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గా సంధ్యారాణి గిరిజన సమస్యలపై ఇచ్చిన హామీల గురించి సంఘాలు ప్రశ్నించాయని, ప్రభుత్వం స్పందించకపోతే పోరాటానికి కార్యాచరణ ప్రకటించాయని చెప్పారు. శ్యామలాంబ పండుగని తాను మంత్రిగా వున్నప్పుడు నిర్వహిస్తే ప్రభుత్వం నుంచి డబ్బులు తీసుకొస్తానని యువరాజుకు చెప్పినట్లు తెలిపారు. ఇప్పుడు శ్యామలాంబ పండుగ నిర్వహిస్తే గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ప్రభుత్వం నుంచి ఎంత తీసుకొస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. తాను మంత్రి గా వున్నప్పుడు కొండ మోదమ్మ జాతరకు, శంబర జాతరకు ప్రభుత్వం నుంచి నిధులు తీసుకొచ్చానని గుర్తు చేశారు. ప్రజల నుంచి చందాలు వసూలు చేయకుండా ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించాలని రాజన్నదొర కోరారు.

మున్సిపల్ కార్మిక సమస్యలు పరిష్కరించాలి

ఎపిమున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక సంస్థలైన మున్సిపాలిటీలకు అవసరమైన నిధులు విడుదల చేసి, కార్మికులకు మౌలిక వసతులైన మంచినీరు, మరుగుదొడ్లు, పని ప్రదేశాల్లో పనిముట్లు, రక్షణ పరికరాలు సమకూర్చాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికుల గేటు మీటింగులో పాలకొండ కమిటీ అధ్యక్షులు సురేష్, కార్యదర్శి సంజీవి అధ్యక్షతన సభ జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు మాట్లాడారు. రాష్ట్రంలో మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై నవంబర్ 10 వరకు కార్యాచరణ ప్రకటించారు. ఈనెల 25న కార్మిక సమస్యలపై సంతకాల సేకరణ, 30న మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నాలు, నవంబర్ 10న ఇంజనీరింగ్ కార్మికుల రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్మికులకు బకాయి ఉన్న చనిపోయిన కుటుంబాల నష్టపరిహారాలు, సమ్మెకాలం నాటి వేతనాలు, క్లాప్ ఆటో డ్రైవర్లకు కార్మికులతో సమానంగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు నష్టం చేసే ఎఫ్‌ఆర్‌ఎస్, ఇంటింటా జియో టాకింగ్, తడి, పొడి చెత్త వంటి కార్యక్రమాలు కార్మికులపై పని భారాన్ని పెంచుతాయి తప్ప ఉపయోగం లేదని, పెరిగిన జనాభాకు తగ్గట్టుగా ముందుగా కార్మికులను పెంచాలని కోరారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.రమణారావు మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉమ్మడి ఐక్య పోరాటాల ద్వారానే విజయాలు వచ్చాయని, ప్రస్తుత ప్రభుత్వం కార్మికులకు ఉన్న సమస్యలు పరిష్కరించి ప్రభుత్వం చిత్తశుద్ధి నిరూపించుకోవాలని, లేకుంటే పోరాటానికి సిద్ధపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ జిల్లా నాయకులు తుపాకుల వెంకటరావు, పాలకొండ కమిటీ నాయకులు వేణు, సురేష్, సంజీవి పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్ననాయకులు ఎన్‌వై నాయుడు

నేడు విజయనగరం జిల్లాకు ఉపముఖ్యమంత్రి రాక

గుర్లలో డయేరియా బాధితులను పరామర్శ

ప్రజాశక్తి-విజయనగరంకోట



ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సోమవారం జిల్లాలో పర్యటిస్తున్నారు. ఈ మేరకు కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్.. ఉపముఖ్యమంత్రి పర్యటన వివరాలు వెల్లడించారు. ఉప ముఖ్యమంత్రి సోమవారం ఉదయం 9:30 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి 11 గంటలకు నెల్లిమర్ల రైల్వేస్టేషన్ సమీపంలోని ఎస్‌ఎస్‌ఆర్ పేట స్టోర్స్ వద్దకు చేరుకుంటారు. అక్కడ స్టోర్స్ తనిఖీ అనంతరం, గుర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శిస్తారు. 11.30 గంటలకు గుర్ల గ్రామానికి చేరుకుని జలజీవన్ మిషన్ పనులను, గ్రామంలో పారిశుధ్య పరిస్థితులను, తాగునీటి సరఫరా పరిస్థితిని తనిఖీ చేస్తారు. గ్రామస్తులతో ముఖాముఖిలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటలకు గుర్లలో బయలుదేరి కలెక్టరేట్‌కు చేరుకుంటారు. అక్కడ జిల్లా అధికారులతో డయేరియా పరిస్థితిపై సమీక్షిస్తారు.

నేడు చేబియ్యంవలసలో గ్రామసభ

వీరఘట్టం : మండలంలోని ఆడారు పంచాయతీ పరిధి చేబియ్యం వలసలో సోమవారం భూ రీ సర్వే సమస్యల పరిష్కార గ్రామసభ నిర్వహించనున్నట్లు తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

తుపాను పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి - పార్వతీపురం

తుఫాను పట్ల జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ అన్నారు. వాతావరణ శాఖ సూచనలు మేరకు ఈనెల 23 నుండి 26 వరకు తుపాను కారణంగా వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు ఆదివారం జిల్లా, మండల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాలు, వరదల పరిస్థితిని గమనించాలని తెలిపారు. వసతి గృహాలను తనిఖీ చేయాలని, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో ఎవరూ ఉండరాదని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు సమాచారం అందించాలని ఆయన సూచించారు. లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని, రాకపోకలకు యిబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, నదులు, వాగులు, వంకలు, చెరువులను ఎవరూ దాటకుండా, దిగకుండా సూచనలు చేయాలని ఆయన తెలిపారు. అటువంటి ప్రదేశాల్లో సిబ్బందిని ఏర్పాటు చేయడం, సూచనల బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. విపత్తులు సంభవించే అవాశాలు ఉన్న ప్రదేశాలు వద్ద పూర్తి అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రెవిన్యూ అధికారులను ఆదేశించారు. విపత్తుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని రెవిన్యూ అధికారులను ఆదేశించారు. గెడ్డలు, వాగులు, వంకలు పొంగే ప్రదేశాలు ఉంటాయని పేర్కొన్నారు. ఇటువంటి ప్రదేశాల్లో పోలీసు, వాలంటీర్లు లేదా ఇతరులను ఏర్పాటు చేసి ప్రమాదాల నివారించాలని అన్నారు. గతంలో జరిగిన విపత్తుల పరిస్థితిని గ్రామాల్లో తెలుసుకుని పక్కా ప్రణాళికలు తయారు చేసి సమర్పించాలని ఆదేశించారు. గత అనుభవాల దృష్ట్యా అన్ని చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. రహదారులపై ఉన్న పెద్ద గతకల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, అటువంటి చోట్ల నీరు నిల్వ ఉండకుండా చూడాలని ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న భవనాలు, స్లాబ్ లు పడిపోయే అవకాశం ఉన్న భవనాలు, మట్టి ఇళ్లలో ఉన్న వాటిని సురక్షిత భవనాల్లోకి మార్చాలని ఆయన ఆదేశించారు. అధికారులు, సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం, ఎంఎల్ హెచ్పి, సీహెచ్ డబ్ల్యులతో సహా ఎవరూ ప్రధాన కేంద్రాన్ని విడిచి వెళ్లరాదని ఆయన ఆదేశించారు.

అటవీ, వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ లక్ష్యం రూ.62 కోట్లు

1993 నుంచి కారుణ్య నియామకాల్లేవు


జిసిసిలో సిబ్బంది కొరత ఉంది

జిసిసి డివిజనల్ మేనేజర్ వి.మహేంద్రకుమార్

జిసిసిలో 1993 నుంచి కారుణ్య నియామకాలు నిలిపివేసినట్లు డివిజనల్ మేనేజర్ వి.మహేంద్ర కుమార్ చెప్పారు. అలాగే ఈ ఆర్థిక సంవత్సరం అటవీ, వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ లక్ష్యంగా రూ.62కోట్లు నిర్దేశించినట్టు తెలిపారు. సంస్థ వ్యాపార కార్యకలాపాల గురించి ప్రజాశక్తితో ఆయన ముఖాముఖి మాట్లాడారు .

- ప్రజాశక్తి, పార్వతీపురం





- **జిసిసి ఏఏ ఉత్పత్తులు కొనుగోలు చేస్తోంది?**

చింతపండుతో పాటు కరక్కాయలు, నల్లజీడిపిక్కలు, కుంకుడుకాయలు, ఎండు ఉసిరి, తానికాయలు, నరమామిడి చెక్క, కాగు పప్పు, ఇప్ప పప్పు, కొండచీపుర్లు కొనుగోలు చేస్తాం. గిరిజనులు సేకరించిన తేనె కూడా కొంటాం. తేనె గిట్టుబాటు ధర రూ.200 నుంచి 250 రూపాయలకు పెంచాం. మిగిలిన అన్ని అటవీ ఉత్పత్తులకు ఏటా గిట్టుబాటు ధర కల్పిస్తున్నాం. చింత పండు కిలో 32.40 చొప్పున కొనుగోలు చేస్తాం.

- **జిసిసి వ్యాపార లక్ష్యం ఎంత?**

ఈ ఏడాది జిసిసి వ్యాపార లక్ష్యం లక్ష్యం రూ.62 కోట్లు. అటవీ వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ లక్ష్యం రూ.12 కోట్లు. నిత్యవసర వస్తువుల వ్యాపార లక్ష్యం రూ.48.5 కోట్లు. ఇంతవరకు 33 కోట్ల వ్యాపారం చేయాల్సి వుండగా రూ.22 కోట్లు వ్యాపార లావాదేవీలు నిర్వహించాం.

- **గత ఐదేళ్లలో వ్యాపార లావాదేవీలు ఏ మేరకు పెరిగాయి?**

గడిచిన ఐదేళ్లలో జిసిసి వ్యాపార లావాదేవీలు ఏటా పెరుగుతూ వస్తున్నాయి. 2019-20లో వ్యాపార లక్ష్యం రూ.44కోట్లు, 2020-21లో రూ.47కోట్లు, 2021-22లో రూ.52.7 కోట్లు, 2022-23 లో రూ.53.5 కోట్లు, 2023-24లో రూ.60.9 కోట్లు, 2024-25లో రూ.62.5 కోట్లు.

- **జిసిసిలో ఎన్ని డిపోలున్నాయి? సిబ్బంది కొరత ఏమేరకు ఉంది?**

సంస్థలో మొత్తం 101 డిఆర్ డిపోలున్నాయి. రెగ్యులర్ సేల్స్ మాన్లు 12 మంది మాత్రమే ఉన్నారు. కాంట్రాక్టు సేల్స్‌మాన్లు 24 మంది, డీలర్లు 31 మంది, స్వయం సహాయక సంఘాలు 10. వీరి ద్వారా ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న గిరిజనులకు నెలనెలా నిత్యావసర సరుకుల పంపిణీ జరుగుతుంది. 24 డిపోలకు సేల్స్ మాన్లు లేరు.

- **అటవీ వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు ఎప్పటి నుంచి ప్రారంభమవుతుంది?**

నవంబర్ నుంచి అటవీ, వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు ప్రారంభ మవుతుంది. ఏడు రైతు సేవా కేంద్రాల ద్వారా గిరిజనుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తాం. గత ఏడాది ఖరీఫ్ సీజన్లో రూ.10 కోట్ల మేర ధాన్యం కొనుగోలు చేశాం. ఈ ఏడాది ధాన్యం కొనుగోలు లక్ష్యం రూ.9.25 కోట్లు, అటవీ ఉత్పత్తుల కొనుగోలు లక్ష్యం రూ.2.75 కోట్లు.

- **జిసిసికి చెందిన సబ్బుల తయారీ యూనిట్లు ఎందుకు మూతపడ్డాయి?**

2019 నుంచి ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు కాస్మొటిక్స్ పంపిణీ నిలిచిపోయింది. విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లో అమ్మ ఒడి పథకం కింద నేరుగా డబ్బులు జమ చేయడంతో కాస్మెటిక్స్ పంపిణీ నిలిపివేశారు. దీని వల్ల జిసిసికి చెందిన సబ్బుల తయారీ యూనిట్లు మూతపడ్డాయి. విజయనగరం, అరుకులో ఉన్న సబ్బుల తయారీ యూనిట్లు మూతపడి వున్నాయి. ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థులకు కాస్మెటిక్స్ పంపిణీ చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

- **జిసిసి నిర్వహించే ఇతర వ్యాపార కార్యకలాపాలేవి?**

గుమ్మలక్ష్మీపురంలో పెట్రోల్ బంక్ నిర్వహిస్తున్నాం. కొమరాడలో మరో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన వుంది.

- **శిథిలావస్థలో ఉన్న జిసిసి గోడౌన్ల నిర్మాణానికి తీసుకునే చర్యలేమిటి?**

శిథిలావస్థలో ఉన్న గోడౌన్ల నిర్మాణానికి రూ.4 కోట్లతో ప్రతిపాదనలు పెట్టాం. సాలూరు, గుమ్మలక్ష్మీపురం, పార్వతీపురంలో గోడౌన్ ఉన్నాయి. సాలూరు, గుమ్మలక్ష్మీపురం గోడౌన్లు జిసిసికి చెందినవి. పార్వతీపురం గోడౌన్ అద్దెకు నిర్వహిస్తున్నాం.

- **జిసిసి డివిజనల్ ఆఫీస్ నిర్మాణానికి చర్యలేమిటి?**

జిసిసి డివిజనల్ కార్యాలయం, బ్రాంచ్ కార్యాలయం నిర్మాణానికి పార్వతీపురంలో వైకెఎం కాలనీలో 26 సెంట్లు స్థల సేకరణ చేశాం.

- **జిసిసి ఉత్పత్తులు ఎక్కడెక్కడ లభిస్తాయి?**

జిసిసి ఉత్పత్తులు గుమ్మలక్ష్మీపురం, పార్వతీపురం, సాలూరు సూపర్ బజార్ ల్లో లభిస్తాయి.

- **చింతపండు సేకరణ లక్ష్యం ఎంత?**

రానున్న ఏడాది ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు చింతపండు కొనుగోలు చేస్తాం. 4వేల క్వింటాళ్ల చింతపండు కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించాం .


సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు అప్పారావు

యూనియన్ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

యూనియన్ బలోపేతానికి సంబంధించిన నిర్ణయాలను తీసుకున్నట్లు ఎఐజిడిఎస్ సంఘం డివిజనల్ కార్యదర్శి ఎం.అప్పారావు తెలిపారు. పార్వతీపురం డివిజన్ ఎఐజిడిఎస్ పోస్టల్ ఉద్యోగుల సంఘం ద్వివార్షిక సమావేశం ఆదివారం స్థానిక ఎన్జీవో హోంలో నిర్వహించారు. కేంద్ర సంఘాల పిలుపు మేరకు ఎఐఇయు, జిడిఎస్ యూనియన్లు ఎఐజిడిఎస్‌లో విలీనమై 90శాతం సభ్యులతో అతిపెద్ద యూనియన్‌గా ఆవిర్భవించిన తరువాత నిర్వహిస్తున్న ఈ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఎఐటిఆర్ఎ పార్వతీపురం డివిజన్ కార్యదర్శి ఎంవి చలం, పి.రామానందం, జి.తవిటి నాయుడు, ఎల్.బాబురావు, ఎం.ఈశ్వరరావు, క్లాస్-3 కార్యదర్శి జె.రవీంద్రనాథ్, క్లాస్ -4 కార్యదర్శి బి.ఉమాశంకర్ రవు తదితరులు పాల్గొన్నారు.


అడలి వ్యూపాయింట్‌కు పోటెత్తిన పర్యాటకులు

అడలి వ్యూ పాయింట్ సందర్శన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని అడలి వ్యూ పాయింటును ఆదివారం పర్యాటకులు సందర్శించారు. పార్కులో ఉన్న అందాలను ఆశ్వాదించారు. మంచు కొండలు కరిగిపోయే అందాలను కనువిందు చేసుకుంటున్నారు. అనంతరం సీతంపేట మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించారు. అక్కడ పర్యాటకులు జలకలాడారు. అనంతరం ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్ ను సందర్శించారు. జలవిహార్ వద్ద బోట్ షికారు చేశారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో విహారం చేశారు. ఫైవ్ డి థియేటర్ ను వీక్షించారు. హ్యాంగింగ్ బ్రిడ్జిపై యువకులు నడిచి వెళ్లారు.



వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రాజేష్

వాహనదారులు తప్పక హెల్మెట్లు ధరించాలి

ప్రజాశక్తి - సీతానగరం

వాహనదారులు తప్పక హెల్మెట్లు ధరించాలని ఎస్సై ఎం.రాజేష్ అన్నారు. మండలంలోని బుడ్డిపేటలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణా చర్యల్లో భాగంగా ప్రతి ఒక్కరూ హెల్మెట్లు ధరించాలని, 18 ఏళ్లు నిండిన యువకులు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నలపరాదని, ప్రభుత్వ నిబంధన మేరకు అన్ని పాటించాలన్నారు, అలాగే వ్యసనాలకు దూరంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలోని కిట్టలపాడు జంక్షన్ వద్ద సీతంపేట ఎస్సై వై.అమ్మన్నరావు యువకులకు సైబర్ క్రైమ్‌పై ఆదివారం అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత గురించి వివరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. మితిమీరి వేగం వెళ్లరాదని అన్నారు. వాహన చోదకుడికి లైసెన్స్ సి-బుక్ ఇన్సూరెన్స్ హెల్మెట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. డ్రంకింగ్ డ్రైవ్ చేయరాదన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ సంజీవ్ తదితరులున్నారు.

11 లోగా ఇంటర్ ఫీజు చెల్లించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

2025 మార్చిలో జరగబోయే మొదటి, రెండో సంవత్సరం ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫీజును నవంబరు 11లోగా చెల్లించాలని డిఇవిఒ డి.మంజులవీణ ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరం, రెండో సంవత్సరం థియరీ పరీక్షల ఫీజు రూ.600 గానూ, జనరల్, ఒకేషనల్ ప్రాక్టికల్స్‌కు అదనంగా రూ.275, బ్రిడ్జ్ కోర్స్ రాయాలనుకున్న విద్యార్థులు అదనంగా రూ.165, మొదటి, రెండో సంవత్సరం (రెండు సంవత్సరాల బ్యాక్లాగ్ పేపర్లు) పరీక్షలు రాస్తున్న విద్యార్థిని విద్యార్థులు రూ.1200, మొదటి, రెండో సంవత్సరం (రెండు సంవత్సరాలు కలిపి) ఒకేషనల్ ప్రాక్టికల్స్ రాస్తున్న విద్యార్థులు రూ.550 చెల్లించాలని ఆమె తెలిపారు. హాజరు మినహాయింపు (ప్రైవేటు) విద్యార్థులు రూ.1500 ఫీజు చెల్లించాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ పరీక్ష ఫీజును ఆన్లైన్లో చెల్లించడానికి ఆఖరి తేదీ వరకు వేచి చూడకుండా ముందుగానే పరీక్ష ఫీజు ఆన్లైన్లో చెల్లించవచ్చని ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. రూ.1000 అపరాధ రుసుంతో నవంబర్ 20 వరకు ఫీజులు చెల్లించవచ్చని ఆమె తెలిపారు.

ట్రాన్స్ జెండర్లు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి - కురుపాం

ట్రాన్స్ జెండర్లు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మిస్బా వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ షిరిన్ ఖాన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో గల గాంధీ నగర వీధిలో ఉంటున్న ట్రాన్స్ జెండర్ల జీవనోపాధి నిమిత్తం యస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ ఆధ్వర్యంలో మిస్బా వెల్ఫేర్ సొసైటీ, వైజాగ్ మాజీ నేవీ ఉద్యోగులు సంయుక్తంగా సహకారంతో కొబ్బరి కాయల, పూజ సామగ్రి, కిరణ షాప్, హోటల్ ఏర్పాటుకు కావాల్సిన వస్తువులు, నగదును వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా మిస్బా వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ షిరిన్ ఖాన్ మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్లు ఆర్థికంగా అభివృద్ధి చెంది సమాజంలో గౌరవంగా బతకాలనే ఉద్దేశ్యంతో సహకారం అందించామని అన్నారు. మాజీ నేవీ ఉద్యోగి నగేష్ మాట్లాడుతూ తాము అందిస్తున్న సహకారాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోని ఆదర్శంగా ఉండాలని అన్నారు. అనంతరం ట్రాన్స్ జెండర్ గ్రూప్ సభ్యులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మిస్బా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు అబ్దుల్లా , మాజీ నేవీ ఉద్యోగులు శిరాజుద్దీన్, ప్రతాప్,తిరుపతి రావు, ట్రాన్స్ జెండర్ గ్రూప్ అధ్యక్షులు ఎ. గీతరాణి తదితరులు పాల్గొన్నారు.


ట్రాన్స్‌జెండర్లతో దుకాణం ప్రారంభిస్తున్న సొసైటీ సభ్యులు

బెలుగొండ... సమస్యలు నిండా

కనీస అవసరాలకు నోచుకోని గిరిజనులు
విద్యుత్, తాగునీరు, విద్య అందని ద్రాక్షే

ప్రజాశక్తి - మక్కువ

ఎత్తయిన కొండల మధ్య ఆవాసముంటూ అందరి వెలుగునూ చూస్తేనే అన్ని సమస్యలతో పాటు చీకట్లోనే మగ్గుతున్న గిరిజన గ్రామం అది. సుమారు రెండు ఎకరాల రెవెన్యూ పరిధిలో ఏడు కుటుంబాలు నివసిస్తున్న గ్రామం. రికార్డులో గ్రామం ఉన్నప్పటికీ ప్రభుత్వ పరంగా అందవలసిన సౌకర్యాలు ఏవి అక్కడివారికి అందే పరిస్థితి లేదు. ఇదీ పనసభద్ర పంచాయతీ పరిధిలోని బెలుగొండ గిరిజన గ్రామం దుస్థితి.

బెలుగొండ గిరిజన గ్రామంలో సుమారు 7 గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయి. ఇది పూర్తి ఏజెన్సీ గ్రామం. మక్కువ మండలం నుంచి దుగ్గేరు మీదగా ఈ గ్రామానికి చేరాలంటే గగనమే. అలాంటిది అక్కడ గిరిజనులను నిత్యం సమస్యలు పట్టిపీడిస్తున్నా ప్రభుత్వ అధికారులు ఎవరూ ఆ గ్రామం వైపు చూడకపోవడంతో అవస్థలతో గిరిజనులు కొట్టుమిట్టాడుతున్నారు. కనీస జీవనానికి అవసరమైన తాగునీరు, విద్యుత్, రహదారి, అంగన్వాడి, పాఠశాల, వైద్య సౌకర్యాలు అందడం లేదు. సౌకర్యాలు, నిత్యావసర సరుకులు వారి దరిదాపులో కూడా చేరలేదంటే ఆశ్చర్యపడనక్కర్లేదు. ఇక్కడ నివసిస్తున్న వారంతా యువతరానికి చెందిన గిరిజనులే. పాతకాలం గిరిజనులంతా ఒక్కరంటే ఒక్కరు కూడా లేకపోవడం ఒకంత ఆశ్చర్యకరం కలిగిస్తోంది. ఇదిలా ఉండగా నిత్యావసర సరుకుల కోసం సుమారు 6 కిలోమీటర్ల అటవీ ప్రాంతంలో నడిచి మెండంగిలో సరుకులు తీసుకోవలసిన దుస్థితి. ఇప్పటి వరకు విద్యుత్ వెలుగులు కూడా ఆ గ్రామానికి లేవంటే స్వతంత్ర భారతావని చరిత్రలో ఒక వింతగా చూడాల్సి వస్తుందని అక్కడ గిరిజనులు వాపోతున్నారు. సాలూరు మండలం కొడమ పంచాయతీ కొందపాక నుంచి సుమారు మూడున్నర కిలోమీటర్లు నడిచి బెలుగొండ గ్రామానికి చేరుకోవాల్సి ఉంటుంది. కనీస రహదారి సౌకర్యం కూడా ఈ గ్రామానికి లేదు. దీనిపై ఇప్పటికే పలుమార్లు తమ సమస్యలు పరిష్కరించాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్‌కు గ్రామానికి చెందిన యువకుడు శ్రీధరపు విజయ్ పాల్ ఆధ్వర్యంలో గిరిజనలు వినతిని అందజేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ గ్రామానికి కనీస సౌకర్యాలు అందించాలని కోరుతున్నారు.


కనీస సౌకర్యాల్లేని బెలుగొండ గిరిజన గ్రామం

నేడు పార్వతీపురంలో మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం మెగా జాబ్ మేళా జరుగు తుందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధికల్పనలో భాగంగా టెన్త్, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, ఎంబిఎ చదువుకుని 18 - 30ఏళ్ల మధ్య గల నిరుద్యోగ యువతీ, యువకులు జాబ్ మేళాలో పాల్గొనవచ్చని చెప్పారు. ఈ జాబ్ మేళాకు 18 రకాల కంపెనీలకు చెందిన ప్రతినిధులు అర్హత కలిగిన అభ్యర్థులను వారి కంపెనీలకు ఎంపిక చేసుకుంటారని తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు తమ వివరాలను https://skilluniverse.apssdc.in వెబ్ సైట్లో నమోదు చేసి, రిఫరెన్స్ నెంబరుతో పాటు అభ్యర్థి బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు ఒరిజినల్, జిరాక్స్ ప్రతులను, ఒక పాస్పోర్ట్ సైజ్ ఫోటోతో హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు 6305110947, 89788 78557 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

నీటి కుంటలు ఏర్పాటుతో ఎంతో మేలు

ప్రజాశక్తి - వీరఘట్టం

నీటి కుంటల ఏర్పాటు వల్ల ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని ఎన్‌డిఎ కూటమి పట్టణ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ, సరిపల్లి అచ్యుతరావు అన్నారు. ఆదివారం వీరఘట్టంలో నీటికుంటల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎపిఒ జి.సత్యం నాయుడు, మేజర్ పంచాయతీ ఎగ్జిక్యూటివ్ అధికారి ఎం.రవి, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు రాయిపల్లి రత్నాకర్, జామి సింహాచలం, కర్రి నాగభూషణరావు, కర్రి అప్పన్న, పి.మహేష్, సింహాచలం, జామి విజయ తదితరులు పాల్గొన్నారు.

రోజూ ఇదే సమస్యా!

- రోడ్డు అడ్డంగా నిలిచిపోయిన లారీ
- భారీగా స్తంభించిన ట్రాఫిక్
- ప్రయాణికులు ఆవేదన

ప్రజాశక్తి - కొమరాడ

రోజూ ఇదే సమస్యా... ఎప్పటికప్పుడు రోడ్డు మధ్యలో వాహనాలు మరమ్మతుకు గురవ్వడం, ట్రాఫిక్ స్తంభించిపోయి రాకపోకలు నిలిచిపోవడం నిత్యకృత్యమైపోయింది... ఈ రోడ్డును బాగు చేసేదెప్పుడో... ఈ సమస్య తీరెదెప్పుడోనని ప్రయాణికులు, వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని అంతర్‌రాష్ట్ర రహదారి ఎక్కడికక్కడ భారీ గొయ్యిలు ఏర్పడడం, అందులో భారీ వాహనాలు ఇరుక్కుపోయిన ప్రతి రోజూ ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందుపడుతున్న ప్రయాణికులు, వాహనచోదకుల అవస్థలు వర్ణణాతీతం.

మండల కేంద్రానికి సమీపాన గల అంతర్రాష్ట్ర రహదారిపై గోతుల వద్ద లారీ మరమ్మతులకు గురవ్వడంతో భారీ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఒక్కరోజు కాదు, రెండు రోజులు కాదు గడిచిన నాలుగేళ్లుగా ఈ రహదారిపై ఇదే పరిస్థితి. గంట గంటకు ట్రాఫిక్ ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడింది. గడిచిన నాలుగేళ్లుగా పార్వతీపురం నుండి కూనేరు మీదుగా మూడు రాష్ట్రాలకు వెళ్లే రహదారి మార్గంలో ఎప్పటికప్పుడు ఇదే పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో ఆ రోడ్లో ప్రయాణించాలంటేనే వాహనదారులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. విషయం తెలుసుకున్న సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి అంతర రాష్ట్ర రహదారిపై లారీ డ్రైవర్లు వాహనదారులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణమే కలెక్టర్ ప్రకటించిన రూ.11.75 కోట్లు విడుదల చేసి ఈ రహదారిపై ఏర్పడ్డ గోతులు కప్పి అటు వాహనదారుల, ఇటు ప్రయాణికుల ప్రాణాలు కాపాడాలని కోరారు. అధికారులు స్పందించి పూర్తిగా రోడ్డు వేయకపోయినా తాత్కాలికంగానైనా భారీ గోతులను కప్పి ట్రాఫిక్ అంతరాయాన్ని నివారించాలని డిమాండ్ చేశారు.


గొయ్యిలో దిగబడి మరమ్మతులకు గురైన లారీ


రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

పల్లె పండగతోనే గ్రామాలు అభివృద్ధి

ప్రజాశక్తి - కురుపాం

గ్రామాల అభివృద్ధి పల్లె పండుగతోనే సాధ్యమని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని గుజ్జువాయి పంచాయతీలో సర్పంచ్ హెచ్.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన పల్లె పండగ కార్యక్రమానికి ముఖ్య అతిథి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంటికొండ నుండి చినఅంటిజోల వరకు 1.6 కిలోమీటరు బిటి రోడ్డు మంజూరైన రూ.కోటీ45లక్షలతో చేపట్టనున్న పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. అలాగే ఉరిడి పంచాయితీలో గుంజరాడ నుండి ఉరిడి వరకు 2.15 కిలోమీటర్లు రూ.కోటీ 50 లక్షలతో మంజూరైన బిటి రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ కెవి కొండయ్య, జనసేన నియోజకవర్గ ఇన్చార్జి కె.మల్లేశ్వరరావు, జనసేన మండల కన్వీనర్ ఎన్.వంశీ, ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి, ఇఒపిఆర్‌డి జి.రమేష్ బాబు, ఎపిఒ పి.బావాజీ, జెఇ పి.నాగేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని లక్ష్మీపురం, ఏగోటి వలసలో పల్లె పండగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఒ పి.భాను మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం ద్వారా మంజూరైన బిటి రోడ్లు, కాలువలు, సోఫిట్స్ వంటి కార్యక్రమాలు నిర్ణీత సమయాల్లో పూర్తి చేయాలన్నారు. ముందుగా ఆయా గ్రామ సర్పంచులు టి.సత్యవతి, కుంటి రాధాకృష్ణ కొబ్బరికాయ కొట్టారు. అలాగే టిడిపి నాయకులు చప్ప సుధాకర్, విజయలక్ష్మి, గౌర భాస్కరరావు, చంద్ర ఉమామహేశ్వరరావు, గువ్వల బాలగౌరీశ్వరరావు, వార్డు మెంబర్లు కాలు పెంటయ్య గొర్రె చెల్లెమ్మతో పాటు గ్రామపెద్దలు తుమ్మలపల్లి వెంకటరమణ, చప్ప సింహాచలం, తిరుపతిరావు చిన్ని అప్పయ్యతో పాటు ఉపాధి హామీ, గ్రామ సచివాలయ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోని కుమ్మరిగుంటలో ఎపిఒ జి.సత్యంనాయుడు ఆధ్వర్యంలో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సోక్ పీట్స్ తవ్వకాలు జరిపేందుకు భూమి పూజ చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సిహెచ్ చక్రధర్ రావు, ఉప సర్పంచ్ ప్రకాశరావు, హనుమంతు సత్యానారాయణ, గౌరీశంకర్, గణేష్, టెక్నికల్, ఫీల్డ్ సహాయకులు నీలిమ, లక్ష్మీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెద్దబొండపల్లి సమీపాన ఏనుగుల గుంపు తిష్ట

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

సీతానగరం మండలం జోగింపేట పరిసరాల్లో గత కొద్ది రోజులుగా సంచరించిన ఏనుగుల గుంపు ఆదివారం వేకువన పార్వతీపురం మండలం పెదబొండపల్లి, సూరంపేట గ్రామాల మధ్యలో ఉన్న తోటల్లో తిష్ట వేశాయి. పెద్దబొండపల్లికి చెందిన భూపతి శంకర్రావు, పోల సూర్యనారాయణ, రావాడా ఆదినారాయణ, జనార్ధన్ అనే రైతుల వరి పొలాల్లో దిగి పంట ధ్వంసానికి పాల్పడ్డాయి. ఈ సందర్భంగా అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసి నష్టపరిహారం ఇప్పించాలని రైతులు కోరుతున్నారు. ఏనుగులు జనావాసాలకు దగ్గరలో ఉన్నందున ప్రజలెవరూ అత్యుత్సాహం ప్రదర్శించి వాటి ఏకాంతానికి భంగం కలిగించరాదని, రాళ్లు, కర్రలు వేయడం వల్ల అవి జనాలకు ఎదురు తిరిగే అవకాశం ఉన్నందున గ్రామస్తులు అప్రమత్తంగా వ్యవహరించాలని రూరల్ ఎస్సై సంతోషి కుమారి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అలాగే రాత్రిపూట అనవసరంగా ఒంటరిగా బయట సంచరించ కూడదని సూచించారు.


ఏనుగులు ధ్వంసం చేసిన వరి పంట

రైల్వే డిఆర్ఎంకు సిపిఎం ధన్యవాదాలు

ప్రజాశక్తి - కొమరాడ

రాయపూర్ ప్యాసింజర్ రైలు పాత సమయం పునరుద్ధరించనందుకు రైల్వే డిఆర్ఎంకు సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ధన్యవాదాలు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో విశాఖపట్నం నుంచి ఉదయం 4.15గంటలకు రాయపూర్ వెళ్లే రైలు వల్ల పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రానికి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, వ్యాపారస్తులకు, ఉద్యోగులకు చాలా అనుకూలంగా ఉండేదని అన్నారు. ఆ ట్రైన్ కొన్ని నెలలపాటు విశాఖపట్నం నుండి కొరాపుట్ ట్రైన్‌కు రాయగడ వరకు లింక్ కలపారు. దీంతో రాయపూర్ రైలు పార్వతీపురం వచ్చేసరికి ఉదయం 10 గంటల సమయం దాటుతుందన్నారు. దీనివల్ల అనేకమంది ప్రయాణికులు చాలా ఇబ్బంది పడే పరిస్థితి ఉందని తెలిపారు. దీంతో రాయపూర్ ట్రైన్ పాత సమయాన్ని పునరుద్ధరించాలని, అలాగే అటు ఒరిశా, ఇటు ఆంధ్రాకు ఎంతో ఉపయోగకరమైన కూనేరు రైల్వే స్టేషన్లో గుంటూరు - రాయగడ వెళ్లే ట్రైన్ హాల్ట్ ఇవ్వాలని కోరారు. ఈ మేరకు రైల్వే అధికారులు స్పందించి ఆదివారం నుంచి రాయపూర్ ట్రైన్ పాత సమయంలో పునరుద్ధరించినందుకు అటు రైల్వే డిఆర్ఎం, ఇతర రైల్వేశాఖ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

పుష్ప శ్రీవాణి కుల వివాదంపై హైకోర్టు తీర్పు హర్షణీయం

ప్రజాశక్తి - కురుపాం

మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్ప శ్రీవాణి కుల వివాదంపై హైకోర్టు ఇచ్చిన తీర్పు హర్షించదగ్గ విషయమని మండల వైసిపి కన్వీనర్ ఐ.గౌరీ శంకర్, జెడ్‌పిటిసి సభ్యులు జి. సుజాత అన్నారు. ఆదివారం చినమేరంగిలో మాజీ ఎమ్మెల్యే అతిథిగృహం కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ పుష్పశ్రీవాణి ఎస్‌టి కాదని మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజుతో పాటు నిమ్మక సింహాచలం ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తూ ఆమె ఎన్నిక చెల్లదని 2019లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారన్నారు. ఈ వివాదాన్ని అన్ని విధాలా పరిశీలించిన హైకోర్టు పుష్ప శ్రీవాణి ఎస్‌టి కొండదొరగా తీర్పును ఇచ్చిందన్నారు. ఇకనైనా ఆమెపై అసత్య ఆరోపణలు మానుకోవాలన్నారు. ఆమెను కలిసి అభినందన తెలియజేసిన వారిలో వైస్ ఎంపిపిలు అన్నాజీరావు, రంగారావు, నీలకంఠాపురం సర్పంచ్ ఎ.మన్మధరావు, కురుపాం మేజర్ పంచాయతీ సర్పంచ్ జి.సుజాత, ఎంపిటిసి జి.విద్యారాణి, వైసిపి నాయకులు ఐ.రామకృష్ణ, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.


విజయ చిహ్నానికి చూపుతున్న మాజీ ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, వైసిపి నాయకులు


ఐదు నెలల చిన్నారికి నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు

ప్రజాశక్తి- బొబ్బిలి

మండలంలోని కొత్తపెంట గ్రామానికి చెందిన ఐదు నెలల చిన్నారి సిరికి ధన్విక తన ప్రతిభతో నోబెల్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించుకొని అందరిచే ఔరా అనిపించుకుంది. 120 ఫ్లాష్ కార్డులను గుర్తించి నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సొంతం చేసుకుంది. గ్రామానికి చెందిన సిరికి లక్ష్మంనాయుడు, హారిక దంపతుల కుమార్తె ధన్వికకు రెండు నెలల వయస్సు నుంచి తల్లిదండ్రులు వివిధ వస్తువులు, బొమ్మలు చూపించి గుర్తుపట్టేలా అవగాహన కల్పించారు. ఇలా 120 రకాల విభిన్న ఫ్లాష్ కార్డులు (జంతువులు, పక్షులు, కూరగాయలు, పండ్లు, రంగులు వివిధ దేశాల జెండాలు) గుర్తు పడుతున్న వీడియో రికార్డులను నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సంస్థకు పంపించగా వారు రికార్డుకు ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు ప్రశంసపత్రం, మెడల్స్ ను ధన్విక తల్లిదండ్రులకు పంపించారు. ఈమేరకు ఆదివారం మంత్రి గుమ్మిడి సంధ్యారాణి చిన్నారి దన్విక మెడలో మెడల్ వేసి అభినందించారు.

నగరాన్ని సమగ్రాభివృద్ధి చేయాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని డిమాండ్
- ఉత్సాహంగా సాగిన సిపిఎం నగర మహాసభ
- ఆకట్టుకున్న ప్రదర్శన



మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

విజయనగరాన్ని సమగ్రాభివృద్ధి చేయాలని, అందుకోసం సిపిఎం పోరాడుతుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ స్పష్టంచేశారు. ఆదివారం సిపిఎం నగర మూడో మహాసభ ఉత్సాహ పూరిత వాతావరణంలో సాగింది. కలెక్టరేట్ నుంచి డప్పు వాయిద్యాలతో, కోలాటంతో ప్రారంభమైన ర్యాలీ.. ఎన్‌పిఆర్ భవనం వరకు సాగింది. అనంతరం సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో తమ్మినేని మాట్లాడారు. విజయనగరం కార్పొరేషన్‌గా మార్పు చెందినా, అందుకు అనుగుణంగా అభివృద్ధి చేయలేదన్నారు. పాలకులు మారినా విధానాలు మారలేదని చెప్పారు. నగరంలో పరిస్థితులు చూస్తుంటే, మున్సిపల్ కార్మికులు తగినంత మంది లేరన్నారు. మురికివాడలు మరింత అధ్వానంగా తయారవుతున్నాయని చెప్పారు. పేదలకు అవసరమైన రూ.200 కుళాయిలు ఇవ్వడం లేదన్నారు. పేదలు నివాసముండే ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు, కనీస మౌలిక సదుపాయాలు లేవని చెప్పారు. జ్యూట్ మిల్లులు మూతపడి వేలాది మంది రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. కొత్తగా పరిశ్రమలు రాలేదన్నారు. మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి పేదల బతుకులు ఛిద్రమవుతున్నాయని తెలిపారు. ఎక్కడా కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. ప్రభుత్వ విధానాలు, ఇసుక దొరక్క పోవడంతో భవన నిర్మాణ రంగం దెబ్బతిందని చెప్పారు. జనాభా పెరుగుతున్నా మున్సిపల్ పాఠశాలలు, వసతిగృహాలు పెరగడం లేదని, ప్రభుత్వ డిగ్రీ కాలేజికి సొంత భవనం లేదని ఆక్షేపించారు. టిడ్కో ఇళ్లు కట్టినా అప్పగించలేదని, జగనన్న కాలనీలు పూర్తి కాలేదని, హుదూద్ ఇళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించలేదని విమర్శించారు. చెరువులు, ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనా, వాటిని రక్షించే పరిస్థితి లేదని ధ్వజమెత్తారు. ఇలా అభివృద్ధికి దూరంగా ఉన్న విజయనగరం సమగ్రాభివృద్ధికి తగినన్ని నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాబోయే కాలంలో ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యదర్శి నివేదికను నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ, ఎ.జగన్ మోహన్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు బి.రమణ, వి.రామచంద్రరావు, వి.లక్ష్మి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.